
క్లుప్తంగా

ముగిసిన చెంగాళమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీ చెంగాళమ్మ దేవత జాతర బ్రహ్మోత్సవాల్లో సోమవారంతో ముగిశాయి. జాతరలో భాగంగా శ్రీచెంగాళమ్మ దేవత విగ్రహాన్ని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సుబ్రమణ్యస్వామి, వినాయకస్వామి విగ్రహాలను, నవగ్రహాలను పూలతో అలంకరించారు. అనంతరం చెంగాళమ్మ, ఇతర దేవతా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

డెంగీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట: 'దోమల నుంచి రక్షించుకుందాం ..డెంగీని తరిమికొడదాం' అని సోమవారం రామకృష్ణాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో తారకరామానగర్ పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటయ్య మాట్లాడుతూ, జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు డెంగీకి కారణమైన దోమ పుట్టుక, పెరుగుదల, దోమల నిర్మూలన తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పుష్పలత, ఎంఎల్‌హెచ్‌పి శైలజ, ఏఎన్‌ఎం నీలవేణి, ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు, చాముండేశ్వరి, దేవి, తులసి, 104 సిబ్బంది సురేష్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం



పరిసరాలను శుభ్రం చేసి బ్యానర్ ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు

రేణిగుంట: పోలీసులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి సోమవారం శ్రమదానం చేశారు. పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. మందుబాబులు మద్యం సేవిస్తున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో మద్యపానం నిషేధం బ్యానర్లను ఏర్పాటు చేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా తమ సిబ్బందితో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శ్రమదానంలో అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, పోలీసులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని చల్లమాంబపురం, తిమ్మభూపాలపురం, చిన్నయగుంట గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీదేవి వీఆర్ఓలు, సర్వేయర్లను ఆదేశించారు. ఆమె సోమవారం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. భూసమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. కార్యాలయం చుట్టూ పనుల కోసం ప్రజలు తిరగకుండా చూడాలన్నారు. భూముల సర్వేను పూర్తి చేయాలన్నారు. పెండింగ్ భూముల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

- 10కి.మీల దూరం పలింతల గుంతలు!
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు
- కూటమి ప్రభుత్వానికి చెవికెక్కని ఇబ్బందులు

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం



యానాదివెట్టు వద్ద ఛిద్రమైన రోడ్డులో వాహనదారుల అవస్థలు, (ఇన్‌సెట్) అరవిందనగర్ వద్ద రోడ్డు దుస్థితి



తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చూస్తారని, కొత్త రోడ్లు వేస్తామని హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత ఆ ఊసే విస్మరించారు కూటమి నేతలు. వరదయ్యపాళెం మండలం కదూరు కూడలి నుంచి చిన్న పాండూరు వరకు ఉన్న సత్యవేదు ప్రధాన రోడ్డు మార్గం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా భారీ గోతులే కనిపిస్తున్నాయి. వర్షం వస్తే ఇక బావులను తలపించే గుంతలు దర్శనమిస్తాయి. వీటి వల్ల వాహనచోదకుల పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

వరదయ్యపాళెం: సత్యవేదు ప్రధాన రోడ్డు మార్గంలోని కదూరు కూడలి నుంచి చిన్న పాండూరు వరకు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు అభివృద్ధికి రూ. 4.50కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొంతమేరకు పనులు మొదలు పెట్టి పార్టు బిల్లు కోసం ప్రభుత్వానికి నివేదించాడు. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ఈ పనులకు పూనుకోలేదు. ఏడాదిన్నర కాలంగా ఆ రోడ్డు మార్గంలో కొంతమేరకు జరిగిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు వెరసి రోడ్డు పొడవునా అడుగుకో గుంత ఏర్పడింది. దీనికి తోడు ఇటీవల రోడ్డుకు ఇరువైపులా అటు గ్యాస్ పైపులైను, ఇటు పరిశ్రమలకు వాటర్ పైపులైను ఏర్పాటు కోసం గోతులు తీసి ఉన్న రోడ్డును సైతం పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రధానంగా యానాదివెట్టు కంచరపాళెం, అరవిందనగర్, సుబ్బరాజుకండ్రిగ, వెంకటరెడ్డి కండ్రిగ గ్రామాల వద్ద పూర్తిగా రోడ్డు దెబ్బతింది. ఇక్కడ స్థానిక గ్రామస్తులు సైతం ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న ఆందోళన చెందుతున్నారరు. అయితే కాంట్రాక్టర్ మాత్రం బిల్లు ఇవ్వనిదే పనులు చేయలేమని చేతులెత్తేశారు. ఇక ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం చేసేదేమీలేక ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు.

ఎంతో కీలకమైన రోడ్డు మార్గంపై ఇంత నిర్లక్ష్యమా?:

సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గం గుండా రోజువారీ శ్రీసిటీ పరిశ్రమలకు, శ్రీసిటీ వెలుపల ఉన్న చిన్న పాండూరు, మాదనపాళెం ఏపీఐఐసీ సెజ్‌ల పరిధిలోని హీరో, అపోలో, మరికొన్ని పరిశ్రమలకు రోజువారీ వందలాది వాహనాల ద్వారా వేలాది మంది ఉద్యోగులు పరిశ్రమలకు వెళ్తుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డు మార్గం అభివృద్ధి గురించి కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేదు. పల్లె పండుగ అంటూ హడావిడి చేశారే తప్ప రోడ్లు మాత్రం ఎలా ఉన్నవి అలానే ఉన్నాయి. రోడ్ల అభివృద్ధి గురించి ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో చేసిందేమీ లేదని ప్రజలు మండిపడుతున్నారు. వేలాదిగా వెళ్లే రోడ్డు మార్గం అభివృద్ధి గురించి ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



యానాదివెట్టు వద్ద గుంతలు పడ్డ ఆర్అండ్‌బీ రోడ్డు



కంచరపాళెం వద్ద బావులను తలపిస్తున్న గుంతలు



వెంకటరెడ్డికండ్రిగ వద్ద గుంతలమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు

సెక్యూరిటీ గార్డులను తొలగించొద్దు : అంజూరు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ గార్డుల్లో 50 ఏళ్లు పైబడిన సుమారు 30 మందిని తొలగిస్తూ దేవస్థానం అధికారులు తీసుకున్న నిర్ణయం సరికాదని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నప్పుడే 50 ఏళ్లు దాటితే తొలగిస్తామనే మాట చెప్పలేదని, ఇప్పుడు అర్ధాంతరంగా వారిని తొలగిస్తే ఆ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మానవతా దక్పథంతో వ్యవహరించి వారి సేవలను వినియోగించుకునేలా చూడాలని కోరారు. అలాగే హోంగార్డులను ఆలయం బయట ప్రాంతాల్లో కాకుండా లోపల నాలుగు మాడ వీధులలో విధులకు వినియోగిస్తే భక్తుల తొక్కిసలాటలకు తావుండదని సూచించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వరదయ్యపాళెం సీపీఐ జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిన్నిరాజ్

వరదయ్యపాళెం: జిల్లాలోని సూళ్లూరుపేటలో ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే భారత కమ్యూనిస్ట్ పార్టీ సీపీఐ తిరుపతి జిల్లా రెండవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం వరదయ్యపాళెం బస్టాండ్ ఆవరణలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ భారతదేశంలో ఏర్పడి ఈ ఏడాది డిసెంబర్ 26వ తేదీ నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతుందని, ఈ తరుణంలో జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సిద్ధలయ్య, బాలగురునాథం, కృష్ణమూర్తి, తరుణ్‌కుమార్, చంద్ర పాల్గొన్నారు.

మాత్రల పేరిట టోకరా..

- నగలతో ఉడాయించిన కేటుగాడు

తొట్టంబేడు: మీ ఇంట్లో బంగారం అమ్మవారి మెడలో వేసి, మళ్లీ మీకు ఇస్తే శుభం కలుగుతుందనా చెప్పి, ఇద్దరి మహిళలను ఓ మోసగాడు బురిడీ కొట్టించిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. తొట్టంబేడు మండలం పొయ్యి గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఓ వ్యక్తి ముసుగు ధరించి, వాతం, విరేచనాల నివారణకు మాత్రలిస్తామంటూ వీధి వీధి తిరిగాడు. అనంతరం ఓ మహిళ ఇంటికి వెళ్లి మీ ఇంటికి మంచి జరగాలంటే.. పసుపు కుంకుమ, ఉప్పు, మిరపకాయలు ఓ వైట్ పేపర్‌లో పట్టుకు రమ్మని చెప్పాడు. ఆమె తేవడంతో ఏదో ధ్యానం చేసినట్లు నటించి, మీ ఇంట్లో బంగారం తెచ్చి ఇస్తే, అమ్మవారి మెడలో వేసి, ఓ గంటలో తిరిగి మీకు తెచ్చిస్తానని, అంతా శుభమే కలుగుతుందని నమ్మించాడు. దీంతో ఆ మహిళ తన చెవిలోని రెండున్నర గ్రాముల బంగారు కమ్మలు ఇచ్చింది. అవి తీసుకుని అతడు ఉడాయించాడు. అలాగే మండలంలోని చిన్న సింగమాలలో ఓ మహిళ వద్ద ఉదయం 10 గంటలకు నాలుగు గ్రాముల బంగారం తీసుకుని పారిపోయాడు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగలోని ఆర్‌ఎస్‌కేలో జీలగలను పంపిణీ చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్టి విత్తనాలను వ్యవసాయాధికారి షణ్ముగం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పంట పొలాల్లో సాగు చేయడం వల్ల భూమిలో సత్తువ పెరుగుతుందని తెలిపారు. 10 కేజీల జీలగలు 50 శాతం రాయితీపై రూ.615 లకు, అదేవిధంగా నవధ్యానాలు 10 కేజీలు రూ.650 పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని బయోమెట్రిక్ విధానంలో రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. జీలగలు కావలసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాసుపుస్తకాలు తీసుకురావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ కోసం తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రేవతి, రైతులు కన్నయ్యనాయుడు, గోపి, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు పరిసమాప్తం



తిరుచ్చి వాహనంలో ఆండాళ్ అమ్మవారితో వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారంతో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు ముగిశాయి. పది రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజైన సోమవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారు వేంకటేశ్వరస్వామితో తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలను, అర్చనలను చేశారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆండాళ్ అమ్మవారి సమేతుడై తిరుచ్చి వాహనాన్ని అధిరోహించారు. గోవింద నామస్మరణ, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి ఊరేగింపు పురవీధుల్లో కర్పూర హారతులను అందుకుంటూ ముందుకు సాగింది. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ నేతకు పరామర్శ



సౌజన్యను పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ శ్రీకాళహస్తి ప్రాజెక్టు నాయకురాలు సౌజన్యకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ఓ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. సోమవారం సాయంత్రం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేఎస్ఎన్ ప్రసాదరావు తదితరులు ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పంచాయతీని శాసిస్తున్న యూనియన్లు

రేణిగుంట: కార్మికులకు ఏదైనా నష్టం లేదా కష్టం జరిగితే ఎదుర్కొనేందుకు వీలుగా ఉండేందుకు కొన్ని యూనియన్లలో కార్మికులు చేరుతున్నారు. అయితే ఇదే అవకాశంగా కొందరు యూనియన్ నాయకులుగా అవతారం ఎత్తి అధికారులను బెంబేలెత్తించే స్థాయికి చేరారు. అంతేకాకుండా కొందరు కార్మికులు సైతం వారి అండ చూసుకుని కేటాయించిన పనులు చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. మేజర్ పంచాయతీ అయిన రేణిగుంటలో దాదాపు 120 మంది పంచాయతీ కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం ఆ కార్మికులే వారి జీవనాధారంగా కొందరు యూనియన్ నాయకులు చలామణి అవుతున్నారు. పారిశుధ్య కార్మికులకు కేటాయించిన పనులు చేయకుండా పై అధికారులు ఒత్తిడి తెస్తే యూనియన్ నాయకుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇంతమంది కార్మికులు ఉన్నా రేణిగుంటలో ఎక్కడ చూసినా పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి. ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉన్న చందాన ఉంటోంది. జిల్లాలో ఎక్కడ వామపక్ష సమావేశాలు జరిగినా యూనియన్ నాయకుల ఒత్తిడితో పారిశుధ్య కార్మికులు వెళ్తున్నారు. దీనిని ప్రశ్నించిన అధికారులపై యూనియన్ నాయకులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ పారిశుధ్య కార్మికులను, యూనియన్ నాయకులను సరైన దారిలో పెట్టే దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నిర్మాణ దశలోనే ఆగిన సచివాలయ భవనం



నాగలాపురం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలని గత ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ లక్ష్యం నీరుగారుతోంది. దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన సచివాలయ వ్యవస్థ కూటమి ప్రభుత్వం వచ్చాక సేవలందించడంలో నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ మేరకు నాగలాపురం బీసీ కాలనీలో సచివాలయం–3 భవనం నిర్మాణ దశలోనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా.. ఇప్పటి వరకు అసంపూర్తిగా ఆగిపోయిన సచివాలయ భవనాల పూర్తిపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదు. రూ.లక్షలు వెచ్చించిన భవనం నిర్మాణ దశలో ఆగిపోవడంపై స్థానిక ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రాష్ట్రంలో కక్షపూరిత పాలన



పెద్దిరెడ్డిని కలిసిన సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, వరదయ్యపాళెం నేతలు

వరదయ్యపాళెం: ఎన్ని అక్రమ కేసులు బనాయించినా పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోవడం ఎవరి వల్ల సాధ్యం కాదని, త్వరలోనే కడిగిన ముత్యంలా ఎంపీ మిథున్ రెడ్డి బయటకు రావడం ఖాయమని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. సోమవారం తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన, నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాజీమంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. అందరూ సంయమనంతో ధైర్యంగా ఉండాలని సూచించినట్లు వారు తెలిపారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర చేనేత కార్మిక విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, నాయకులు నరేంద్ర, లోకేష్ తదితరులు ఉన్నారు.

ఈవ్‌టీజర్‌కు దేహశుద్ధి

రేణిగుంట: జన్మమెత్తితివి..అనుభవించితివి..అని ఈవ్‌టీజర్‌కు దేహశుద్ధితో ఆ గ్రామస్తులు జ్ఞానోదయం కలిగించారు. కాలేజీకి వెళ్తున్న విద్యార్థినులను దారి కాచి వెకిలి చేష్టలతో ఇబ్బంది పెడుతున్న ఓ వివాహితుడికి తమదైన శైలితో బుద్ధి చెప్పి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఎర్రమరెడ్డిపాలెం నుంచి తిరుపతికి వెళ్లి డిగ్రీ చదువుతున్న ఇద్దరు అమ్మాయిలను పరంధామ (32) అనే వ్యక్తి నెలరోజులుగా దారి కాచి వెకిలి చేష్టలతో వేధిస్తున్నాడు. విసిగి వేసారిన ఆ అమ్మాయిలు తమ పెద్దలకు చెప్పారు. దీంతో సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోకి వచ్చిన ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ఆపై జరగాల్సిన కార్యక్రమాలు ఆటోమేటిగ్గా జరిగిపోయాయి. అంతే..! తదనంతరం గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు. యర్రావారిపాళెం మండలానికి చెందిన ఇతడు వివాహితుడు కూడా. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో నివాసం ఉంటున్నాడని తేలింది. ఇతడు రేణిగుంట ఎస్టేట్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ చివరకు ఇలా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ అడ్డంగా బుక్ అయ్యాడు.

చెత్త టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు





డంప్ చేసిన చెత్త, టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోని అత్తూరు–కల్లూరు గ్రామాల మధ్య సోమవారం రాత్రి చెత్తను డంప్ చేసేందుకు తిరుపతి నుంచి వచ్చిన నాలుగు టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ, పగటిపూట రెండు టిప్పర్లు చెత్త తీసుకొచ్చి అన్‌లోడ్ చేశారని, తాము అడ్డుకోవడంతో ఇక చెత్తను ఇక్కడ డంప్ చేయమని చెప్పి వెళ్లిపోయారన్నారు. మళ్లీ రాత్రి గుట్టుగా టిప్పర్లతో చెత్త తీసుకువచ్చారని మండిపడ్డారు. గ్రామాల మధ్య చెత్త డంపు చేయడం వల్ల వివిధ సమస్యలు తలెత్తుతున్నాయని ఇప్పటికే హెచ్చరించినా మళ్లీ ఇలా చేయడం ఏమిటని టిప్పర్ డ్రైవర్లను నిలదీశారు. చెత్త టిప్పర్ల సమాచారాన్ని ఏపీఐఐసీ అధికారులకు, పోలీసులకు తెలియజేశారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- ఎన్నికల హామీలు నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్
- కూటమి ప్రభుత్వంపై సీపీఐ విమర్శ




వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తిరుపతి జిల్లాలో పలు సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కార్పొరేట్ సంస్థలకు జేబులు నింపడమే లక్ష్యంగా వెళ్తోందని ఆరోపించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ విధానాలను రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల భారం మోపి ప్రజలకు షాక్ ఇచ్చిందని, ఎన్నికల హామీలు నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మరల్చుతోందని దుయ్యబట్టారు. సీపీఐ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో నిర్వహించనున్న తిరుపతి రెండవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, మండల కార్యదర్శులు వైఎస్ మణి, గోపి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కత్తి రవి, ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్, హరి, శారదమ్మ, సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ నాయకులు గిరి బాబు రాజ్, స్ట్రీట్ వండర్స్ యూనియన్ నాయకులు మురళి, జనార్ధన్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేది సీపీఐ

శ్రీకాళహస్తి: పేదలకు అండగా నిలిచేది సీపీఐ మాత్రమే అని ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. సోమవారం మండలంలోని ముళ్లపూడి ఎస్టీ కాలనీలో మండల మహాసభ మించల శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేసి గురవయ్య మాట్లాడారు. సీపీఐ దశాబ్దాల ప్రస్థానంలో ప్రజలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ఇక, కూటమి నాయకులు ఎన్నికలలో ఇచ్చిన తల్లికి వందనం, మహిళలకు నెలకు 1500, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. తదితర హామీలను నెరవేర్చకుండా ప్రజలకు పంగనామాలు పెడుతోందని విమర్శించారు. సీపీఐ తిరుపతి జిల్లా మహాసభలు ఆగస్టు 3, 4, 5 తేదీలలో సూళ్లూరుపేటలో నిర్వహిస్తారని, ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. రేణిగుంట మండల కార్యదర్శి వైఎస్ మణి, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు కార్తీక్, మురళి, జనార్దన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ముని చందు, రాజయ్య, మణి, నరసింహారావు, బత్తమ్మ, ఈశ్వరమ్మ, గోవిందయ్య, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్లకు దరఖాస్తులు



అడ్మిషన్ కరపత్రాలను చూపుతున్న టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. ఆయన సోమవారం పాఠశాల్లో ఉపాధ్యాయులతో కలసి అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 15 ఏళ్లు నిండిన వారు ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించవచ్చని, అదేవిధంగా పదవ తరగతి పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. ఇందులో చేరిన వారికి సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహిస్తామని, ఇష్టమైన ఐదు సబ్జెక్టుల్లో కోర్సును పూర్తి చేసుకోవచ్చని, ఎస్సీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు అడ్మిషన్ ఫీజులో రాయితీ ఉందని, ఈ కోర్సులో పాసు అయిన వారి సర్టిఫికెట్లు డిజీ లాకర్లో అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.